క్లుప్తంగా...

జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ ట్రెండ్స్ ఇన్ హిస్టారికల్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. విభాగం హెడ్ ప్రొ.అంజయ్య అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.రవీందర్, ఓయూ మాజీ వీసీ సులేమాన్ సిద్ధిఖీ, అలహాబాద్ వర్సిటీ మాజీ వీసీ ప్రొ.రతన్‌లాల్ హంగ్లు ముఖ్య అతిథులుగా హాజరై సదస్సును ప్రారంభించి ప్రసంగించారు.

నేడు, రేపు టీఎస్‌-సెట్

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(టీఎస్‌సెట్‌-2022) నేడు, రేపు జరగనుంది. ఈ నెల 13న జరగాల్సిన పరీక్షను 17కు వాయిదా వేసిన విషయం విదితమే. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని అధికారులు సూచించారు.

ప్రచురించే ముందు వార్తలను సరి చూసుకోవాలి



మాట్లాడుతున్న ఫ్రాంకీ స్టార్స్

ఉస్మానియా యూనివర్సిటీ: వార్తలను ప్రచురించే ముందు సరిచూసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఓయూ జర్నలిజం విభాగం, హైదరాబాద్ ఫ్యాక్ట్‌చెక్‌-2023 ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్టులు తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడం అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి జర్నలిజం విభాగం హెడ్ ప్రొ.స్టీవెన్‌సన్ అధ్యక్షత వహించగా అమెరికా రాయబార కార్యాలయం ఉన్నతాధికారి ఫ్రాంకీ స్టార్స్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీసీపీ స్నేహా మెహ్రా, వీసీ ప్రొ.రవీదర్ మాట్లాడారు.

ఫార్మసీ భవనం ప్రారంభం

రసూల్‌పురా: తిరుమలగిరి ఆర్మీ ప్రాంతంలోని ఈసీహెచ్‌ఎస్ పాలిక్లినిక్‌లో నూతనంగా నిర్మించిన ఫార్మసీ భవనాన్ని సోమవారం తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా బ్రిగేడియర్ సోమశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్‌కే. రెడ్డి, సురేంద్ర నాథ్, గోపు రమణారెడ్డి పాల్గొన్నారు.

హోంగార్డులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

బౌద్ధనగర్: రాష్ట్రంలో పనిచేస్తున్న హోంగార్డులకు వెంటనే డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించాలని టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. చాలీచాలని జీతాలతో అద్దె ఇళ్లలో ఉంటూ దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం 2018 జీవో నంబర్ 14,15 విడుదల చేసినా దాన్ని అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర డీజీపీ కూడా హోంగార్డులకు డబుల్ బెడ్రూమ్‌ల గురించి ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వెంకటస్వామి, ప్రవీణ్ కుమార్, పొట్టి శ్రీను, మంద మురళి, చంద్రమోహన, రాజు, నరేష్ ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ



సనత్‌నగర్: శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బేగంపేట గగన్‌విహార్ కాలనీలోని ఆశ కుటీర్ హోమ్ ఫర్ బ్లైండ్‌లో ట్రస్ట్ ప్రతినిధులు బాలకృష్ణ, వినయ్ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎంతో మానసిక తృప్తి లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ పొరుగువారి పట్ల ఆప్యాయత కలిగి ఉండాలన్నారు.


ఓయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఐఎస్‌ఓ గుర్తింపు



వీసీ నుంచి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రొ.రామ్ వెంకటేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీకి తొలి సారిగా ఐదు ఐఎస్ఓ (ఇంటర్నెషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) గుర్తింపు సర్టిఫికెట్లు లభించినట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. సోమవారం వీసీ లార్జ్‌లో (నివాసం) వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన బోధనకు పలు ఇంజినీరింగ్ విభాగాలతో పాటు బాల, బాలికల హాస్టల్స్, కాలేజీ క్యాంటీన్‌లో రుచి, నాణ్యతతో కూడిన పోషక ఆహారం అందించినందుకు కళాశాల ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఐఎస్ఓ గుర్తింపు లభించినట్లు వివరించారు.

ఠాణా ఏర్పాటు.. అలజడులకు లేదు చోటు



- త్వరలో వారాసిగూడలో పీఎస్ ఏర్పాటు
- చిలకలగూడ పీఎస్‌కు తగ్గనున్న భారం

సికింద్రాబాద్: చిలకలగూడ ఠాణాకు వారాసిగూడ, బౌద్ధనగర్ శివారు ప్రాంతాలు ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలు, అలజడులు ఇంతకాలం విచ్చలవిడిగా సాగాయి. మరికొన్ని రోజుల్లో ఇదే ప్రాంతంలో ఠాణా ఏర్పాటు కానుండటంతో ఇకపై అలజడులు, ఘర్షణలకు అడ్డుకట్ట పడనుంది. ముఖ్యంగా వారాసిగూడ ప్రాంతం అలజడులకు నిలయం. ఈ కూడలిలో ఆటోల అక్రమ పార్కింగ్‌లతో మొదలుకుని ట్రాఫిక్ సమస్యలు మందుబాబుల వీరంగాలు, ఘర్షణలు జరుగుతూనే ఉంటాయి.

కూడలిలో ఇబ్బందికరంగా..

ఈ కూడలిలో విచ్చలవిడి మద్యం విక్రయాలు మహిళలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. బౌద్ధనగర్, షాబాద్‌గూడ, వారాసిగూడ ప్రాంతాలకు చెందిన మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఈ కూడలికి రావాల్సిందే. ఆటోలు, బస్సులకు ఆశ్రయించడం, పిల్లలను స్కూలుకు తీసుకెళ్లడం వంటి అవసరాల కోసం కూడలికి వచ్చే మహిళలకు ఎదురయ్యే సమస్యలు అన్నీఇన్నీ కావు. నిన్న మొన్నటి వరకు అత్యంత బిజీగా ఉండే చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వారాసిగూడ ప్రాంతం ఉండేది. నగరంలోనే విశాలమైన పరిధి కలిగి ఉండడం, దానికి తోడు గాంధీ ఆసుపత్రి భద్రతా వ్యవహారాలు ఈ పీఎస్ పరిధిలోకి రావడంతో వారాసిగూడ అలజడిపై చిలకలగూడ పోలీసుల దృష్టి పెద్దగా పడలేదు.

స్థానికుల హర్షాతిరేకలు

తాజాగా వారాసిగూడ పేరుతో కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అవుతుండడం పట్ల ఈ ప్రాంత ప్రజల్లో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క పోలీస్ స్టేషన్ మాత్రమే కాదు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ఏసీపీ) కార్యాలయం సైతం ఏర్పాటు కానుంది. వారాసిగూడ కూడలికి కూతవేటు దూరంలోని బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో వారాసిగూడ పీఎస్, ఏసీపీ కార్యాలయాల నిర్వహణ కోసం ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో పీఎస్, ఏసీపీ కార్యాలయాలను సిటీ పోలీస్ అధికారులు లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ముషీరాబాద్ పీఎస్ ప్రాంతాలను కలిపి వారాసిగూడ పీఎస్..

చిలకలగూడ నగరంలోనే పెద్ద పోలీస్‌స్టేషన్‌గా ఇంతకాలం కొనసాగుతూ వచ్చింది. మెట్టుగూడ ప్రధాన రహదారి మొదలు చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్, పార్శిగుట్ట, పద్మారావునగర్, గాంధీ ఆసుపత్రి వరకు ఈ పీఎస్ పరిధిలోనికి వచ్చేవి. గాంధీ ఆసుపత్రితోపాటు పలు బస్తీలు చిలకలగూడ పరిధిలో ఉండడం అవసరమైన సిబ్బంది లేకపోవడంతో విధుల నిర్వహణ చిలకలగూడ పోలీసులకు తలకు మించిన భారంగా ఉండేది. తాజాగా బౌద్ధనగర్, వారాసిగూడ, పార్శిగుట్ట ప్రాంతాలను చిలకలగూడ నుంచి విడదీయడంతో కొంతమేర వారికి కొంతమేర భారం తగ్గిందనే చెప్పాలి. చిలకలగూడ నుంచి విడదీసిన ప్రాంతాలకు కొన్ని ముషీరాబాద్ పీఎస్ ప్రాంతాలను కలిపి వారాసిగూడ పీఎస్‌ను ఏర్పాటు చేశారు.



వారాసిగూడ పీఎస్, ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయనున్న బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ భవనం ఇదే..

పోలీస్ రూట్ ఛేంజ్..

మొదటి నుంచి ఒక్క ఓయూ పీస్ మినహా సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్లు నార్త్ జోన్ పరిధిలోనే ఉండేవి. తాజాగా జరిగిన పునర్విభజనలో ఒక్క తుకారాంగేట్ పీఎస్ మినహా మిగతా అన్ని పీఎస్‌లు ఈస్ట్‌జోన్ పరిధిలోని వచ్చాయి. నియోజకవర్గంలో కొత్త పీఎస్‌తో పాటు మొత్తం ఐదు పోలీస్‌స్టేషన్లు ఉండగా ఓయూ, వారాసిగూడ, చిలకలగూడ, లాలాగూడ పీఎస్‌లు ఈస్ట్‌జోన్ పరిధిలో తుకారాంగేట్ నార్త్‌జోన్ పరిధిలో ఉన్నాయి.

ఠాణా ఏర్పాటు శుభ పరిణామం



వారాసిగూడకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు శుభపరిణామం. ఈ ప్రాంతంలో ఇంతకాలం నెలకొన్న అలజడుల నుంచి విముక్తి పొందే అవకాశం ఉంది. అందుబాటులో పోలీస్‌స్టేషన్ ఉందన్న ధైర్యం మహిళల్లో పెరుగుతుంది. పోలీసుల గస్తీ పెరిగి అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట పడాలి.

– డాక్టర్ సయ్యద్ ఆజాం, వారాసిగూడ

భద్రత కట్టుదిట్టం చేయాలి



వారాసిగూడ కూడలిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు, మందుబాబుల వీరంగాలను కట్టడి చేయాలి. అసలే ఇరుకైన రహదారులపై అక్రమ పార్కింగ్‌లను నియంత్రించాలి. మహిళలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించే వాతావరణాన్ని కల్పించాలి.

– మయబ్రహ్మ నరసింహ, న్యాయవాది

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమ సత్తాను చాటుతున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండిలో సోమవారం బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు సరోజిని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్‌లో సామాజిక, ఆర్థిక రాజకీయ రంగాల్లో మహిళలకు ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామన్నారు. మహిళా అభ్యున్నతి, సాధికారతకు తాము కల్పిస్తున్న ప్రాధాన్యతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

ఓయూ స్విమ్మింగ్‌పూల్ పునఃప్రారంభం



స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తున్న వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టును సోమవారం వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణలతో కలిసి పునఃప్రారంభించారు. కరోనా కారణంగా మూడేళ్లుగా స్విమ్మింగ్‌పూల్‌ను మూసేసిన విషయం విదితమే. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 3.30 నుంచి 5.40 వరకు మూడు బ్యాచ్‌లు ఉంటామని మహిళలకు ప్రత్యేకంగా ఉదయం 9.20 నుంచి 10 గంటలకు సమయాన్ని నిర్ణయించారు. ప్రతి బ్యాక్‌కు 40 నిమిషాల సమయాన్ని కేటాయించినట్లు ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ వివరించారు. ఓయూ విద్యార్థులకు నెలకు రూ.100, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు రూ.750, బయటి వ్యక్తులకు రూ.2000, అనుబంధ కాలేజీల అభ్యర్థులకు రూ.750గా నిర్ణయించారు.

పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకోం

ఎమ్మెల్యే కృష్ణారావు భరోసా

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో స్క్రాప్ గోదాముల కూల్చివేతతో తమ ఇళ్లను ఎక్కడ కూల్చివేస్తారోనని స్థానికులు ఆందోళనలో పడ్డారు. ఇక్కడి భూమిని తాము కొనుగోలు చేశామని, తమకు కోర్టు అనుమతి పత్రాలు ఉన్నాయని కొందరు బిల్డర్లు రంగప్రవేశం చేసి కూల్చివేతలు చేపట్టిన విషయం విదితమే. దీంతో ఆందోళన చెందిన బస్తీ నివాసితులు తమ ఇళ్ల జోలికి వస్తారేమోనని భయంతో ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లగా సోమవారం బస్తీవాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక బస్తీ అసోసియేషన్‌తో పాటు బీజేపీ నేత భూమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, నారాయణరావు, నరేష్ తదితర నాయకులు సమావేశంలో పాల్గొని బస్తీ నివాసితుల గోడును ఆలకించారు. బస్తీవాసుల సమావేశానికి హాజరైన నేత శ్రీహరి స్థానికుల సమక్షంలోనే కూకట్‌పల్లి ఎమ్మెల్యేకు ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. ఖాళీ స్థలాల సమస్యపై తాను మాట్లాడనని, అయితే పేదలు ఉంటున్న ఇళ్ల జోలికి వస్తే వారికి అండగా ఉంటానని బస్తీవాసులకు భరోసా ఇచ్చారు.



బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్ నివాసితుల సమావేశంలో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పద్మారావునగర్‌లో ఇటీవల మంత్రి తన సొంత నిధులతో రేణుకా ఎల్లమ్మ దేవాలయం పునర్నిర్మాణం చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన దేవాలయం ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు, గణపతి, చండి హోమాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, పద్మారావునగర్ పార్టీ అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు హరిచారి, సాయిరాం చారి, రామకృష్ణ చారి, నర్సింహచారి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మంత్రి తలసాని

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

సనత్‌నగర్: ప్రభుత్వం అమలుచేస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానం ఈఓ ఎస్. అన్నపూర్ణ అన్నారు. దేవాలయ వీఐపీ వసతి కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఖర్చుతో కూడుకున్న కంటి పరీక్షలు, అద్దాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలుచేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతుండడం ఇక్కడి ప్రజల అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

- బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. భూలక్ష్మీ అమ్మవారి ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న అన్నపూర్ణ

'బోగస్' ఏరివేత షురూ

సాక్షి ఎఫెక్ట్..

రసూల్‌పురా: కంటోన్మెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా బోగస్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని తరచూ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. 'బొల్లారం అంతా బోగస్ ఓట్లే' అనే శీర్షికతో సమగ్ర సమాచారంతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి బోర్డు అధికారులు స్పందించారు. కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ ఆదేశాల మేరకు అధికారులు రిసాలబజార్, పయనీర్ బజార్‌లోని 8-18-143, 8-12-292 ఇంటి నంబర్లు ఇళ్లకు వెళ్లి ఆయా ఇంటి పక్కల ఉన్న వారిని కలిసి పూర్తి వివరాలు సేకరించారు. సర్వేలో తేలిన బోగస్ ఓటర్ల నమోదు వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు.



రిసాలబజార్‌లో సర్వే చేస్తున్న బోర్డు అధికారులు

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

లాలాపేట: తార్నాకలోని సంఘీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. సంఘీ కళాశాలలోని పోలింగ్ బూత్‌లో మొత్తం 286 ఓటర్లు ఉండగా 250 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓయూ లా కళాశాల డీన్ గాలి వినోద్‌కుమార్, ఆర్ అండ్ డీ సెంటర్ చైర్మన్ ప్రొ.ధమణానాయక్, లాలాపేటలోని గడి స్కూల్ హెచ్ఎం ఏ. ప్రతాప్‌రెడ్డి ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి తార్నాక సంఘీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

సనత్‌నగర్, ఖైరతాబాద్ సర్కిళ్లలో..

సనత్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ఖైరతాబాద్ సర్కిల్ ఓటర్లకు సంబంధించి బల్కంపేట ఆర్ అండ్ బీ కార్యాలయంలో (పోలింగ్ స్టేషన్ నెంబర్ 112), బేగంపేట సర్కిల్‌కు సంబంధించి ఎస్పీరోడ్డులోని వెస్లీ బాయ్స్ కళాశాల (పోలింగ్ స్టేషన్ నెంబర్ 106)లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 164 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 139 మంది, బేగంపేట సర్కిల్ పరిధిలో మొత్తం 101 మంది ఓటర్లు ఉండగా 90 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి సందర్శించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు.

మారేడుపల్లిలో 86.57 శాతం..

రాంగోపాల్‌పేట్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మారేడుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో 86.57 శాతం పోలింగ్ జరిగింది. 67 మంది ఓటర్లు ఉండగా 58 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద మర్రి శశిధర్‌రెడ్డి

బోధన్‌కర్ మృతి వైద్యరంగానికి తీరని లోటు

రసూల్‌పురా: ప్రముఖ వైద్యులు ఆక్యుపేషనల్ థెరపిస్ట్ డాక్టర్ బోధన్‌కర్ మృతి వైద్య రంగానికి తీరని లోటని స్వీకార్ ఉప్‌కార్ రిహాబిలిటేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పి. హన్మంతరావు అన్నారు. సోమవారం స్వీకార్ ఉప్‌కార్ సంస్థలో బోధన్‌కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలోని ఉస్మానియా ఆసుపత్రిలో మొదటి ఆక్యుపేషనల్ థెరపిస్ట్ వైద్యులని ఆక్యుపేషనల్ ఇతర వైద్య అంశాలపై హైదరాబాద్‌లో మూడు జాతీయ సదస్సులు నిర్వహించారని ఆయన సేవలకు గానూ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారని గుర్తు చేశారు.

మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు

అడ్డగుట్ట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదైన ఘటన తుకారంగేటు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మూడ్రోజుల పాటు మద్యం దుకాణాలను మూసివేశారు. తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో ఉంటున్న రాణి (52) నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తుంది. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రాణి ఇంటిపై దాడిచేసి 78 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా



ప్రచారం నిర్వహిస్తున్న అఖిల్ యాదవ్

కంటోన్మెంట్: మారేడుపల్లి మాజీ కార్పొరేటర్లు కంటోన్మెంట్ ఎన్నికలపై దృష్టి సారించారు. మారేడుపల్లి ప్రాంతంలో అత్యంత పలుకుబడి కలిగిన కుటుంబాల్లో ఒకటైన చిరబోయిన కుటుంబం నుంచి గతంలో సరితా యాదవ్ (కృష్ణ యాదవ్ సోదరి) అనిత బద్రీనాథ్ యాదవ్ కాంగ్రెస్, టీడీపీల నుంచి మారేడుపల్లి కార్పొరేటర్లుగా పని చేశారు. తాజాగా బోర్డు ఎన్నికల్లోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. చిరబోయిన కృష్ణ యాదవ్ కుటుంబ సభ్యులు ఐదోవార్డు నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీకి సిద్ధమవుతున్నట్లు స్పష్టమైంది. తాజాగా మాజీ కార్పొరేటర్ అనిత బద్రీనాథ్ యాదవ్‌ల కుమారుడు అఖిల్ యాదవ్ నాలుగో వార్డు నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. సోమవారం తండ్రి బద్రీనాథ్ యాదవ్‌తో కలిసి రాజలింగం గార్డెన్స్ ప్రాంతంలో ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అఖిల్ యాదవ్ మాట్లాడుతూ.. నాలుగో వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి బోర్డు సభ్యుడిగా గెలిపిస్తే ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా అన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో కవిత పాత్ర కీలకం



కేక్ కట్ చేస్తున్న గజ్జెల నాగేశ్



కేక్ కట్ చేస్తున్న మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎమ్మెల్సీ కవిత పాత్ర కీలకమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను సోమవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాగృతి ద్వారా రాష్ట్రం సాధించడంలో కవిత తనవంతు పాత్రను పోషించారని రాష్ట్రం ఏర్పాటు తర్వాత మహిళల హక్కుల కోసం ఉద్యమిస్తున్నారన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. మోతే శోభన్‌రెడ్డి, బాబు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదో వార్డు కాకాగూడలో..

కంటోన్మెంట్: ఐదో వార్డు కాకాగూడలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక నేత రావుల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేశ్, శేఖర్, మారుతి, శ్రీకాంత్, మహిళలు, స్రవంతి, అరుణ, ఊర్మిళ, లలిత, శిరీష, రంజిత, సుజాత, ఇందిర పాల్గొన్నారు.